# తప్పిపోయిన అంచనాలు

"కిరణ్"

కథానిక

మిగిలిన నాలుగెకరాల పొలంలో రెండెకరాలు తాకట్టు పెట్టి సుందరరామయ్య ఓ వెయ్యి రూపాయలు అప్పుపట్టుకొచ్చాడు ఆ ఏడాది కొడుకును కాలేజీలో చేర్పించాలి. ఎంత లేదన్నా, కాలేజీలో చేర్పించటానికి ఓంప్రథమంగా అయిదారు వందలు పోను, మిగితా పైకంతో సంవత్సరమంతా కుటుంబపోషణ జరగాలి. మొదట్లో కొడుకును కాలేజీలో చేర్పించటానికి సుతరామూ సుందరరామయ్య ఒప్పుకోలేదు. సుందరరామయ్య పాతకాలపు మనిషి లోకజ్ఞానానికి ఎంత చదువు అవసరమో, అంతమాత్రం చదువు కొంటే చాలనే రకం. అదీగాక, కొంతమంది మిత్రులు సుందరరామయ్యకు సలహాకూడా ఇచ్చారట. ఏవో మెట్రికులేషనుతో చదువు అయిందనిపించి, ఏ గుమాస్తా ఉద్యోగంలోనో చేర్పించమని సుందరరామయ్యకు ఈ సలహా చక్కగా నచ్చింది. కాని ఏం చేయగలడు? కొడుకూ, భార్యా ఇద్దరూ ఒకటయ్యారు. ఏ పరిస్థితులలోనైనా కాలేజీ చదువు చదవాల్సిందేనని పట్టుపట్టి కూర్చున్నారు. సుందరరామయ్యకు ఇక కొడుకును కాలేజీలో చేర్పించక తప్పలేదు. ఏవో నాలుగేళ్లు కళ్లు మూసుకొంటే, కొడుకు బి. ఏ. ప్యాసయి తనని ఆదుకొంటాడనుకొన్నాడు.

అసలు సుందరరామయ్య స్వగ్రామం తెనాలి సమీపంలో ఒక పల్లెటూరు. కొడుకు చదువుల కోసం సొంతసేద్యం వదులుకొని భూముల్ని కమతానికిచ్చి పట్నంలో కాపురం పెట్టాడు. నిక్షేపంలాంటి ఆరెకరాల భూమిని గడచిన ఆరేళ్ళలో కొడుకు హైస్కూలు చదువులకుగాను అమ్ముకొన్నాడు. కొంతవరకూ సుందరరామయ్య భార్య రాజమ్మ ఈ దుర్వ్యయానికి కారణమని చెప్పాలి. పట్నవాసంలో కాపురంబెట్టి కొడుకును చదివించాలని పట్టుపట్టిందీ, భర్తను పురికొల్పిందీ కూడా రాజమ్మే. రాజమ్మ ప్రోద్బలమే లేకుంటే సుందరరామయ్య కొడుకును పట్నవాసంలో చేర్పించి చదివించేటంత సాహసానికి దిగేవాడు కాడేమో. ఏ ఎలిమెంటరీ తరగతులతోనో చదువు అయిందనిపించి, వ్యవసాయంలోకి దింపేవాడు. కాకుంటే వంశాచారప్రకారం జ్యోతిశ్శాస్త్రపారంగతుణ్ణిగా తయారుచేసేవాడు. కాని రాజమ్మ తన కొడుక్కి పెద్దచదువులు చదివించాలని పట్టుపట్టింది. తన భర్త చదువుకొన్నవాడు కాకపోయినా, కనీసం కొడుకైనా చదువుకోవాలనీ, గొప్ప హోదాగల ఉద్యోగాలు చేయాలనీ కోరుకొనేది. తన అక్కకొడుకు మూర్తి మెట్రికులేషను ప్యాసయి ఇంటరులో చేరాడు. కాని ఇంటరులో పార్టు తప్పాడు. ఇహ తనకు చదువు వంటబట్టదని తాలూకాఫీసులో గుమాస్తాగా చేరాడు.

తన కొడుకు ఏనాటికి కూడా తన అక్క కొడుకు మూర్తిలాగా, గుమాస్తాగా చేరే దురవస్థ పట్టకూడదనుకొనేది రాజమ్మ. రాజమ్మ ఆలోచన లెప్పుడూ పై అంతస్తులోనే ఉండేవి. తన కొడుకు ఏ బి. ఏ వో ఎం. ఏ. వో ప్యాసయి ఏనాటి కయినా కనీసం ఓ డిప్యూటీ కలెక్టరు ఉద్యోగమయినా చేస్తాడన్న ధీమా, రాజసం, రాజమ్మలో కనిపించేవి.

కొడుకు ప్రసాదు ఆలోచనలుకూడా ఇంచుమించు తల్లి పోకడలలోనే పోయేవి. తల్లిలాగానే ప్రసాదుకూడా అందని ఆలోచనలు చేసేవాడు. మిథ్యాడంబరాలతో, మిథ్యాభిమానాలతో సతమతమయ్యేవాడు. ప్రపంచాని కంతటికీ అపురూపంగా తనొక్కడే కాలేజీలో చదువుతూన్నట్లుగా మసలేవాడు. కాలేజీలో చదువుతూన్నాడన్న మాటేగాని ప్రసాదుకు లోకానుభవం శూన్యం. తన పుస్తకాలేమో, తనేమో! అంతకుదక్క మరో ప్రపంచం తెలీదు. పుస్తకాలలో వున్నదున్నట్లు మక్కీకమక్కీగా బట్టీపట్టి, ఆ బట్టీపట్టిందికాస్తా పరీక్షలలో కక్కేవాడు. అంచేతనే ప్రసాదు క్లాసుకంతా ఫస్టుగా ఉండేవాడు. లెక్చరర్ల మన్ననలకు కూడా పాత్రుడయ్యాడు.

ప్రసాదు ఇంటరు ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడని తెలిసిన రోజు. రాజమ్మకు పట్టపగ్గాలు లేక పోయాయి. వాడవాడా తన కొడుకు ఘన విజయాన్ని గురించి చాటిచాటి రాజమ్మ అలిసిపోయింది. తన కొడుకుయొక్క ఈ అఖండ విజయాన్ని తెలుసుకోనివాళ్ళెవరయినా ఉన్నారని తెలిస్తే, పనిగట్టుకొని రాజమ్మ వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి చెప్పి వచ్చేది. ప్రసాదుకు ఒకటి రెండు సంబంధాలు కూడా వచ్చాయి పరీక్షా ఫలితాలు తెలిసిన కొద్ది రోజుల్లోగానే. కట్నం విషయంలో బేరాలు తెగక వచ్చిన సంబంధాలు వచ్చినట్లుగానే వెళ్ళాయి.

ప్రసాదు బి. ఏ. ప్యాసయిన సంవత్సరం మరో పెళ్ళి సంబంధం వచ్చింది. ఈ సంబంధం ఎక్కడో దూరపు సంబంధం కాక, అయిన సంబంధం. కట్నం రెండువే లిస్తామన్నారు. కాని రాజమ్మ దృష్టిలో మాత్రం రెండువేల కట్నం చాలా స్వల్ప మనిపించింది. బి. ఏ. ప్యాసయిన తన కొడుక్కు రెండు వేలు కట్నం తీసుకోవటం చిన్నతనంగా తోచింది. తన అక్క కొడుకు మూర్తిగాడు వెధవది మెట్రికులేషన్ ప్యాసయినాడో లేదో రెండువేలు కట్నం తీసుకొన్నాడు. బి ఏ. ప్యాసయిన ప్రసాదును మూర్తిగాడితో సమానం చేసి రెండువేలు కట్నం తీసుకోమనడం తనకెంత అవమానం. రాజమ్మ అహం దెబ్బతిన్నది. కనీసం రెండున్నర వెయ్యి అయినా ఇవ్వందే కొడుక్కి పెళ్ళిచేయనని భీష్మించుక కూర్చుంది. పిల్ల నిస్తామన్నవాళ్లు మరెవ్వరో కాదు; స్వయానా తన పెత్తల్లి కుమారుడు. అయినవాళ్ళంతా చెప్పిచూచారు. కాని రాజమ్మ తన పట్టు విడవనంది. "అయినవాళ్ళు కాబట్టే రెండున్నరవెయ్యికి ఒప్పుకొన్నాను, మరొకరైతే అయిదు వేలకు ఏమాత్రం తగ్గినా ఒప్పుకునేదాన్ని కా"నంది రాజమ్మ. చివరి కేలాగయితే నేం, పిల్లగలవాళ్ళు రెండున్నర వెయ్యి ఇవ్వటానికి ఒప్పుకొన్నారు. అన్ని లాంఛనాలు జరుపుకొంటామన్నారు. ఆ వేసవి సెలవుల్లోనే కొడుకు పెళ్ళి ఘనంగా చేసింది రాజమ్మ.

బి. ఏ. తో చదువుమాని, ఉద్యోగంలో చేరమన్నాడు సుందరరామయ్య. కాని కొడుకు ఎం. ఏ. చదవాలన్నాడు. ఇప్పటికే దాదాపు పదెకరాల పొలమూ హారతి కర్పూరంలా హారించుక పోయింది. తిండికి ఆ రెండెకరాలయినా మిగిల్చి, హాయిగా ఏదేనా ఉద్యోగంలో చేరమన్నాడు సుందరరామయ్య. తండ్రి సలహా ప్రసాదుకు ఏమాత్రం నచ్చలేదు. ఆరు నూరయినా, నూరు ఆరయినా ఎం. ఏ. చదవాల్సిందే నన్నాడు. కొడుకుకు మద్దతు యిచ్చింది రాజమ్మ. చివరకు తల్లిబిడ్డల పంతమే నెగ్గింది. ప్రసాదు మద్రాసు వెళ్ళి ఎం. ఏ.లో చేరాడు. కొడుకును కాలేజీలో చేర్పించటానికి రెండెకరాల పొలమూ తాకట్టు పెట్టి మరో వెయ్యి రూపాయలు అప్పు పట్టుకొచ్చాడు సుందరరామయ్య.

ప్రసాదు బి. ఏ ప్యాసయినాడన్న మాటేగాని, ఇంతవరకూ తల్లీ దండ్రిని విడిచి ఉన్నదిలేదు. అసలు తెనాలికి నాలుగు దిక్కులలో ఏయే ఊళ్ళు ఉన్నవో తెలుసుకొన్నవాడు కూడాకాదు. అలాంటివాడు, ఉన్న•పళంగా, మద్రాసు చేరేసరికి అక్కడి ఆ అధునాతన నాగరికతకూ, కృత్రిమ సౌందర్యానికి తట్టుకోలేక జబ్బిబ్బు అయ్యాడు. అంతా కొత్త వాతావరణమూ, కొత్తమనుష్యులూ ప్రతిదీ ఏదో వింతగా కనిపించేది. హాస్టలు జీవితానికి అలవాటు పడని ప్రసాదు అక్కడ మిగతా స్టూడెంట్సుతో కలిసి సరదాగా ఉండలేక పోయేవాడు. మెరీనాబీచీ, అక్కడ నవనాగరకంగా అలంకరించుకొని తిరిగే యువకబృందమూ, నైలాన్ టిష్యూ చీరల వింత మెరుగులలో జిగజిగ మెరిసి పోయే కాలేజి యువతుల సౌందర్య పరిమళాలు, అన్నీ ప్రసాదును వెర్రెత్తించేవి. విభ్రాంత పరిచేవి. తాను అంతవరకూ గడిపింది అనాగరిక జీవితమని తనలో సిగ్గుపడసాగాడు. పులినిచూచి నక్కవాత పెట్టుకొన్నట్లు, పట్నవాలను పూర్తిగా అనుకరించ పోయి, నగర వాసులకుండే పరిజ్ఞానం, సంస్కారం లౌకికం మొదలైనవి లేకపోవటం మూలాన్ని అథపతనమయ్యే పరిస్థితికి దిగజారాడు.

చదువు విషయంలో క్రమేణ అశ్రద్ధ చేయసాగాడు ప్రసాదు. ఎప్పుడూ సినిమాలు, బీచీ షైర్లతో ప్రొద్దులు పుచ్చేవాడు. ఒకప్పుడు పుస్తకం విడిచి ఎరుగని ప్రసాదు, ఇప్పుడు ఏ వారానికొక్కసారో పుస్తకంముఖం చూచేవాడు. ఇంతకుక్రితం లెక్చరర్ల అభిమానాన్ని చూరగొన్న ప్రసాదు, ఇప్పుడు వాళ్ళ దృష్టిలో కేవలం వ్యర్థుడుగా తయారయ్యాడు.

రెండేళ్లు గడిచిపోయాయి. ఈ రెండేళ్ళలో ఎన్నో మార్పులు జరిగాయి. చివరి టెరమ్‌కు కాలేజీలో డబ్బు కట్టాల్సి, రాజమ్మ చేతనున్న రెండు గాజులమ్మి, కొడుకుకు డబ్బు పంపించవలసి వచ్చింది. అంటే, సుందరరామయ్య ఆర్థిక పరిస్థితి పూర్తిగా క్షీణదశకు వచ్చింది. ఇదంతా ఇటుంచి, రాజమ్మ కిప్పుడు మరో విషయం సంకటమయింది. మూర్తిగాడు ఇప్పుడు రెండొందల రూపాయలు సంపాదిస్తున్నాడట. ఆంధ్రరాష్ట్రం రావటం మూలాన్ని, సులభంగా ప్రమోషన్లు రావటమూ, మూర్తి డిప్యూటీ తహసీలుదారు కావటమూ జరిగాయి. ఈ వార్త విన్నప్పటినుంచీ రాజమ్మ అసూయ పడసాగింది. వెధవ స్కూలుఫైనలు గాడి కేమిటి, రెండొందల జీవితమేమిటను కొంది రాజమ్మ కాని తన కొడుకు ఎం. ఏ. ప్యాసయి వస్తే అంతకు మూడింతలుగా సంపాదించగలడని వెంటనే తన మనసు సమాధాన పరుచుకొంది.

యం. ఏ. పరీక్షా ఫలితాలు తెలిసిన రోజు రాజమ్మ ఎవరికంటా పడలేదు. ప్రసాదు మూడో క్లాసులో యం. ఏ. ప్యాసయ్యాడు. ప్రొఫెసర్లు తనంటే గిట్టక మూడో క్లాసిచ్చారని తండ్రికి సంజాయిషీ చెప్పుకొన్నాడు ప్రసాదు. సుందరరామయ్య మనసులో బాధపడ్డా, పైకి ఏమీ అనలేదు. కాని చూచి చూచి కొడుకుతో ఒకరోజు మాత్రం "చూడబ్బాయి! ఇకనైనా ఏదేనా ఉద్యోగం చూచి త్వరగా చేరు. ఏదో నాలుగు రాళ్ళు సంపాదిస్తేకదా, ఇక్కడి బండి కదిలేది" అన్నాడు.

వేసవి సెలవులయిపోగానే, ప్రసాదు ఉద్యోగాన్వేషణకు దిగాడు. ఇంత చదువూ చదివి, వెధవ గుమాస్తా ఉద్యోగంలో చేరటం తనకెంత చిన్నతనం. కనీసం కాలేజీ ట్యూటరుగానైనా చేరవచ్చుగాని, తాలూకాఫీసులో గుమాస్తాగా చేరటమా! ఛ ఛా అలాంటి తక్కువ ఆలోచన తన మెదడులోకి రానివ్వకూడదనుకున్నాడు. రాజమ్మ కూడా కొడుకు అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించింది. ఏ కాలేజికి వెళ్ళినా, పార్టీలు, కమిటీ రాజకీయాలు. కాలేజీ ఉద్యోగానికి ప్రసాదు తిలోదకాలు ఇవ్వకతప్పింది కాదు. అప్పుడే చదువు ముగించి ఎనిమిది మాసాలయింది. కాని ఇంత వరకూ తనకు ఉద్యోగం అయ్యే సూచనలేమీ కనిపించలేదు. కానీ సంపాదన లేకుండా, పట్నవాసంలో ఎన్నాళ్ళని కాపురాలు చేయగలరు. ఇలాంటి పరిస్థితులలో సంసారాన్ని ఎలా పోషించటమో సుందరరామయ్యకు అర్థంకాలేదు. కొడుకును త్వరగా ఉద్యోగం సంపాదించమని ఒత్తిడి చేయసాగాడు. ప్రసాదు అత్తింటివాళ్లు, వెంటనే పిల్లను కాపురానికి తీసుకువెళ్ళమని ఉత్తరాలమీద ఉత్తరాలు వ్రాయసాగారు. అసలే సంసారం జరగటం కష్టంగా ఉంది. పైగా ఇప్పుడు పెళ్లాన్ని కాపురానికి తీసుకొనివస్తే, గుట్టుగా జరుగుతూన్న సంసారం రచ్చకెక్కి నగుబాట్ల పాలవుతుందేమోనని భయపడ్డాడు సుందరరామయ్య. ప్రసాదుకు పరిస్థితుల ఒత్తిడివల్ల, ఏదో దొరికిన ఉద్యోగంలో చేరటంతప్ప, వేరే గత్యంతరం అవుపించలేదు. రాజమ్మ రాజసంకూడా క్రమేపీ తగ్గసాగింది. ఒక రోజు రాజమ్మ తన అక్క కొడుకు మూర్తి దగ్గరకు వెళ్ళి "చూడు! బాబూ! మా ప్రసాదునకూడా ఏదో ఓ చిన్న ఉద్యోగం చూసిపెడుదూ, నీకు పుణ్యముంటుంది" అంది.

ఓ వారంరోజుల తరువాత ప్రసాదుకు ఉద్యోగం అయినట్లు కాగితం వచ్చింది ఎం. ఏ. డిగ్రీ తీసుకొన్న ప్రసాదు ఇప్పుడు తాలూకాఫీసులో గుమాస్తా. ఎవరేనా రాజమ్మతో "ఏమమ్మా! ఇంతచదువూ చదివించి, చివరకి మీవాణ్ణికూడా గుమాస్తాగా చేర్పించావేం" అంటే—

"ఆఁ ఇదేదో తాత్కాలికంగా చేరాడేకాని మావాడేం ఈ వెధవగుమాస్తా నౌకరీలో శాశ్వతంగా ఉండిపోయేటంత చచ్చునాగమ్మ కాదమ్మోయ్! ఈయేడు కాకపోతే, మరో ఏడు మావాడికి తప్పక కాలేజీలో ఉద్యోగం దొరుకుతుంది" అంటుంది రాజమ్మ, పూర్వపు ధీమా ఏమాత్రం తగ్గనీయకుండా.

కాలప్రవాహంలో ఏళ్ళు దొర్లుకొని పోతున్నాయి. సుందరరామయ్య షష్టిపూర్తి చేసుకున్నాడు. రాజమ్మ తల పూర్తిగా నెరిసింది. ప్రసాదు భార్య ఇప్పుడు నాలుగో కాన్పుకు సిద్ధంగా ఉంది. ఇన్ని మార్పులు జరిగినా, ప్రసాదు ఉద్యోగంలో, రాజమ్మ మాటల తీరులో, మార్పు కనిపించలేదు.

★